

ముస్త్యాలలో కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను టీవీలో వీక్షిస్తున్న ఓ కుటుంబం

## అప్పులతో పాటు ఆస్తులు చూపించాలి



కాంగ్రెస్ ప్రభుత్వం.. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులు మాత్రమే శ్వేతపత్రంలో చూపించింది. నాడు కేసీఆర్ ప్రభుత్వం సృష్టించిన ఆస్తులు కూడా అందులో చూపిస్తే బాగుండేది. ప్రజాప్రయోజనాల కోసం అప్పులు చేయడం పెద్ద నేరమేమి కాదు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసింది. రైతుల కోసం ఎంతో కృషి చేసింది. వీటన్నింటినీ లెక్క కట్టలేం. కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు మానుకొని రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలి. ఇలాంటి శ్వేతపత్రాలతో దేశంలో తెలంగాణ ప్రతిష్ట దెబ్బతింటుంది. కేసీఆర్ ప్రభుత్వం సృష్టించిన ఆస్తులను స్వేదపత్రం ద్వారా కేటీఆర్ ప్రజలకు చక్కగా వివరించారు.

*– ఎర్రబెల్లి సుధీర్‌కుమార్, ప్రైవేట్ అధ్యాపకుడు, చేర్యాల*

## పదేండ్లలో ఐటీ రంగానికి కేరాఫ్‌గా హైదరాబాద్



పదేండ్ల కేసీఆర్ పాలనలో హైదరాబాద్ ఐటీ హబ్‌గా తయారైంది. అంతర్జాతీయ స్థాయి ఐటీ సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయంటే అది కేసీఆర్ ప్రభుత్వం అనుసరించిన విధానమే కారణం. యువతకు హైదరాబాద్ ఉపాధి కేంద్రంగా మారింది. 10 ఏండ్లలో హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కింది. అమెజాన్ మైక్రోసాఫ్ట్ లాంటి పెద్ద కంపెనీలు తమ రెండో క్యాంపస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడంలో ఐటీ మినిస్టర్‌గా కేటీఆర్ చేసిన కృషి మరువలేనిది. దేశంలో నేడు ఐటీకి కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్ నిలిచిందంటే అప్పటి సీఎం కేసీఆర్ పాలనే కారణం.

*– చిలువేరు సుమన్ (సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, సిద్దిపేట)*

## ప్రజల దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ శ్వేతపత్రం



కాంగ్రెస్ విడుదల చేసిన శ్వేతపత్రం మ్యానిఫెస్టోలా ఉంది. ప్రజలు తమకు అధికారం ఎందుకిచ్చారో కాంగ్రెస్ నాయకులు ఆలోచన చేయాలి. ఇంతకు ముందున్న ప్రభుత్వం కంటే మంచిగా పాలన చేయాలి. కానీ ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తాము చెప్పిన హామీలు నెరవేర్చలేకనే శ్వేతపత్రం పేరుతో డ్రామాలు చేస్తుందనే అభిప్రాయం ప్రజలకు కలుగక మానదు. కాంగ్రెస్ మంత్రులు చెబుతున్న సమాధానాలు సైతం ఒకరికి.. ఒకరికి పొంతన లేవు. కాంగ్రెస్ అధికారం రావడంతో పాలన ఎలా చేయాలో అర్థం కాకనే రాష్ట్రం అప్పులపాలు అయ్యిందనే అంశాన్ని లేవనెత్తారు. సమైక్య రాష్ట్రంలో వెనకబడిన తెలంగాణ.. పదేండ్లలోనే అభివృద్ధి రాష్ట్రాల జాబితాలో చేరిన విషయం కాంగ్రెస్ నాయకులకు కనబడుత లేదు. అన్నిరంగాల్లో తెలంగాణ అభివృద్ధి చెందింది. అప్పులతో పాటు ఆస్తులు సైతం పెరిగాయన్న ముచ్చట తెలిసినా కాంగ్రెస్ ప్రభుత్వం బురద జల్లే ప్రయత్నం చేస్తున్నది.

*– లింగంపల్లి తరుణ్‌కుమార్, ఎంబీఏ రెండో సంవత్సరం, ఉస్మానియా యూనివర్సిటీ*



మల్లిగ్‌లో టీవీ ప్రసారాలను వీక్షిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## వీక్షించిన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు

న్యాల్‌కల్, డిసెంబర్ 24: అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా శ్వేత పత్రంతో బీఆర్ఎస్ పాలనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నదని సర్పంచుల ఫోరం న్యాల్‌కల్ మండల అధ్యక్షుడు రవికుమార్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు మారుతీయాదవ్ విమర్శించారు. ఆదివారం కేటీఆర్ తెలంగాణ భవన్ నుంచి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను వారు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులతో కలిసి టీవీలో తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం జరిగిందన్నారు.



# పదేండ్లలో.. వందేండ్ల ప్రగతి

## బీఆర్ఎస్ పాలనలో మారిన మెతుకుసీమ రాత

- రిజర్వాయర్ల ఖిల్లాగా మారిన సిద్దిపేట
- సంగారెడ్డి జిల్లాలో బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతలకు శ్రీకారం
- మెదక్ జిల్లాలో ఘనపూర్ ప్రాజెక్టు ఆధునీకరణ
- హల్దీ, కూడవెల్లి వాగులపై రూ.కోట్లతో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం
- గ్రామాలు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రోడ్ల నిర్మాణం
- కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు, పంచాయతీలు ఏర్పాటు
- చేరువైన పాలన.. వేగంగా పథకాలు, కార్యక్రమాల అమలు
- చక్కటి ప్రభుత్వ భవనాల నిర్మాణం
- జిల్లాకో మెడికల్ కళాశాల.. కార్పొరేట్ స్థాయిలో దవాఖానలు
- ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు
- 24గంటల కరెంట్ సరఫరాతో పవర్ హాలిడేలు, క్రాప్ హాలిడేలు లేవు..
- 11 విడతలుగా అందిన రైతుబంధు సాయం
- రైతుబీమాతో ఏర్పడిన ధీమా
- ఇవన్నీ ప్రజల ముందు సజీవ సాక్ష్యాలు

సిద్దిపేట, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేసీఆర్ ప్రభుత్వం తన తొమ్మిందేడ్ల పాలనలో బలమైన పునాదులు వేసింది. సువిశాలమైన ప్రగతిదారులను నిర్మించింది. ఇటీవల ఎన్నికల్లో గెలిచి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసెంబ్లీ శ్వేత పత్రాలను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో తొమ్మిదిన్నర ఏండ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఏం చేసింది... అనే అంశాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో స్వేద పత్రం విడుదల చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి మెదక్ జిల్లాలో జరిగిన అభివృద్ధిపై ప్రత్యేక కథనం ...తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు విధ్వంసమైన చెరువులను మిషన్‌కాకతీయ ద్వారా పునరుద్ధరించింది. ఆ చెరువులను ప్రాజెక్టులతో అనుసంధానం చేసింది. కాళేశ్వర ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తీసుకువచ్చి సాగునీరు అందించింది. సిద్దిపేట జిల్లాలో రంగనాయక, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లను నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగు నీరు అందించింది. హుస్నాబాద్ నియోజకవర్గంలో గౌరవెల్లి రిజర్వాయర్‌ను ట్రయల్‌రన్ పూర్తిచేసింది. సంగారెడ్డి జిల్లాలో బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పనులకు శ్రీకారం చుట్టింది. మల్లన్నసాగర్‌తో సింగూరు ప్రాజెక్టు లింక్ కలిపింది. మెదక్ జిల్లాలో ఘనపూర్ ఆనకట్టను ఆధునీకరించింది. హల్దీ, కూడవెల్లి వాగులపై అనేక చెక్‌డ్యామ్‌లను బీఆర్ఎస్ సర్కారు నిర్మించింది. ఫలితంగా నీటినిల్వ సామర్థ్యం పెరిగింది. భూగర్భ జలమట్టం పెరిగింది. భూమికి బరువయ్యేంత పంట పండేలా కేసీఆర్ ప్రభుత్వం చేసిందని ఈ ప్రాంత రైతులు చెబుతున్న మాట. రైతుల్లో ఎనలేని భరోసాను కేసీఆర్ కల్పించారు. తాగునీటి కోసం బిందె మీద బిందె పెట్టుకొని మైళ్ల దూరం నడిచిన ఆడబిడ్డల కష్టాలు కేసీఆర్ తీర్చారు. సిద్దిపేట మానేరు పథకం స్ఫూర్తితో రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకం ద్వారా నడింట్ల నల్లాలు పెట్టి, శుద్ధి చేసిన నదీ జలాలను తాగు నీరుగా కేసీఆర్ అందించారు.నీళ్ల సమస్య తీర్చారు. ప్రతి బస్తీకి, ప్రతి పల్లెకు, ప్రతి గూడేనికి, ప్రతి ఇంటికి మంచినీళ్లు అందించారు. జిల్లాలో విద్యుత్ ఉత్పత్తిని పెంచి, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేశారు.నాణ్యమైన కరెంట్ సరఫరా చేసి ఇన్వర్టర్లు, కన్వర్టర్లు, జనరేటర్ల అవసరం ప్రజలకు లేకుండా కేసీఆర్ చేశారు. నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా వ్యవసాయానికి అందించారు. అన్నిరంగాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేసి, క్రాప్ హాలిడేలు, పవర్ హాలిడేలు లేకుండా కేసీఆర్ చూశారు. ఫలితంగా అన్నివర్గాల వారు తమ పనులు చేసుకున్నారు. చేతినిండా పని.. కంటినిండా నిద్ర పోయారు. గ్రామాలు, మండలాలు, జిల్లాకేంద్రాలను అనుసంధానం చేస్తూ పెద్ద ఎత్తున రహదారులు, బ్రిడ్జిలు నిర్మించారు. ప్రజల వద్దకు పాలన చేరువు చేశారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేశారు.పరిపాలన కోసం చక్కటి భవనాలు నిర్మించారు. ప్రతి జిల్లా కేంద్రంలో నూతన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేశారు. సిద్దిపేటలో ఐటీ టవర్ నిర్మాణం చేయడంతో వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దొరికాయి. ప్రతి జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారు. దీంతో వందలాది మంది విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లు దొరికాయి. ప్రభుత్వం పాఠశాలను బలోపేతం చేశారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రం బాలారిష్టాలను అధిగమించి, పెద్ద నోట్ల రద్దు, ఆర్థిక మాంధ్యం, కరోనా వంటి సంక్షోభాలను తట్టుకొని బలీయమైన ఆర్థిక శక్తిగా తెలంగాణ నిలిచింది. కేంద్రం వివక్షను తట్టుకొని సొంత వనరులను సమీకరించుకొని కేసీఆర్ నాయకత్వంలో అద్భుత ప్రగతిని సాధించింది. కరోనా మహమ్మారి దెబ్బకు యావత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తలకిందులైపోయినప్పటికీ, రైతులకు ఇచ్చిన మాట ప్రకారం పంట పెట్టుబడి కోసం రైతుబంధు సాయాన్ని సీజన్ కంటే ముందే కేసీఆర్ అందించిన విషయాన్ని రైతులు గుర్తుచేస్తున్నారు.కేసీఆర్ ప్రభుత్వం మొత్తంగా 11 సార్లు రైతుబంధు సాయాన్ని సకాలంలో రైతులకు అందజేసింది. రైతు ఏ రకంగా మరణించినా ఆ కుటుంబానికి సకాలంలో రైతుబీమాను అందించింది.సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి అందించి ఆ ఇంటి పెద్ద కొడుకుగా కేసీఆర్ నిలిచారు. ఇవన్నీ యావత్తు ప్రజల కండ్ల ముందు జరిగాయి.



### నూతన జిల్లాలు ఏర్పాటైన తర్వాత ఉమ్మడి మెదక్ జిల్లాలో సాగు వివరాలు, పండిన ధాన్యం, రైతులకు చెల్లించిన డబ్బు లు ఇలా..

| సంవత్సరం | (వానకాలం) వరిసాగు విస్తీర్ణం (ఎకరాలు ) | ధాన్యం (మెట్రిక్‌టన్నులు) | రైతులు (కోట్లలో) | రూపాయలు (ఎకరాలు) | (యాసంగి) వరిసాగు విస్తీర్ణం (మెట్రిక్‌టన్నులు) | ధాన్యం | రైతులు | రూపాయలు (కోట్లలో) |
|---|---|---|---|---|---|---|---|---|
| **సిద్దిపేట జిల్లా** | | | | | | | | |
| 2016-17 | 57,865 | 43,576 | 16,613 | రూ.65.76 | 1,06,860 | 1,84,362 | 43,159 | రూ.278.13 |
| 2022-23 | 3,61,096 | 3,62,193 | 89,971 | రూ.746.11 | 3,31,000 | 3,69,365 | 90,860 | రూ.759.18 |
| **మెదక్ జిల్లా** | | | | | | | | |
| 2016-17 | 57,686 | 72,718 | 21,146 | రూ.109.80 | 82,342 | 1,71,708 | 40,676 | రూ.259.28 |
| 2022-23 | 2,90,292 | 3,93,668 | 89,998 | రూ.810.95 | 2,57,210 | 3,25,570 | 85,322 | రూ.670.66 |
| **సంగారెడ్డి జిల్లా** | | | | | | | | |
| 2016-17 | - | 14,008 | 3,792 | రూ. 21.15 | - | 85,175 | 22,124 | రూ.128 |
| 2022-23 | - | 2,39,924 | 46,162 | రూ.494.24 | - | 1,55,000 | 32,000 | రూ.320 |

### సిద్దిపేట జిల్లాలో విద్యుత్ ప్రగతి ...

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఈ తొమ్మిదేండ్ల కాలంలో విద్యుత్‌శాఖలో సమూల మార్పులు వచ్చాయి. ఇప్పటి వరకు సిద్దిపేట జిల్లాలో ఒక విద్యుత్ మీదనే రూ. 4,104. 08 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది.రైతాంగానికి 24 గంటల కరెంట్ ఇస్తుంది.

#### సిద్దిపేట జిల్లాలో విద్యుత్ సరఫరా వ్యవస్థ (ట్రాన్స్‌కో)

| సబ్ స్టేషన్లు | 2014 (నాడు) | 2023 (నేడు) | వ్యయం |
|---|---|---|---|
| 400 కేవీ సబ్‌స్టేషన్లు | 01 | 03 | 560 |
| 220 కేవీ సబ్‌స్టేషన్లు | 01 | 06 | 1030 |
| 132 కేవీ సబ్‌స్టేషన్లు | 10 | 14 | 588 |
| ఈహెచ్‌టీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ | 36 | 121 | 398 |
| మొత్తం వ్యయం | | | 2576 |

#### సిద్దిపేట జిల్లాలో విద్యుత్ పంపిణీ వ్యవస్థ (ఎస్‌పీడీసీఎల్)

| సబ్‌స్టేషన్లు | 2014 (నాడు) | 2023 (నేడు) | వ్యయం |
|---|---|---|---|
| 33/11 కేవీ సబ్‌స్టేషన్లు | 111 | 171 | 92.84 |
| 33 కేవీ సబ్‌స్టేషన్లు | 909 | 1197 | 25.29 |
| 11 కేవీ లైన్లు | 5371.32 | 8232.97 | 121.23 |
| ఎల్‌టీ లైన్లు | 10,892.05 | 13,577.01 | 100 |
| పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు | 184 | 364 | 86.67 |
| డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్ | 19,558 | 36,252 | 352.57 |
| ఇతర పనులు | - | - | 482.65 |
| మొత్తం వ్యయం | | | 1261.25 |

#### సిద్దిపేట జిల్లాలో వినియోగదారుల సంఖ్య

| కనెక్షన్ వివరాలు | 2014 (నాడు) | 2023 (నేడు) |
|---|---|---|
| గృహ వినియోగదారులు | 1,59,900 | 3,34,171 |
| కమర్షియల్ వినియోగదారులు | 14,896 | 41,152 |
| వ్యవసాయ కనెక్షన్‌లు | 1,08,103 | 1,61,470 |
| పారిశ్రామిక వినియోగదారులు | 2,197 | 3,733 |
| హెచ్‌టీ వినియోగదారులకు | 169 | 486 |
| ఇతర కేటగిరీలకు | 3,954 | 10,415 |
| మొత్తం వినియెగదారులు | 2,64,233 | 5,51,427 |

### రైతుబీమా కొండంత ధైర్యాన్నిచ్చింది

సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలో సన్న, చిన్న కారు రైతులే అధికంగా ఉన్నారు. రైతు భీమా ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో16,061 మంది రైతు కుటుంబాలకు గాను రూ. 803. 05 కోట్లు కేసీఆర్ ప్రభుత్వం అందించింది.ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున నేరుగా రైతు నామిని ఖాతాలోనే జమ చేశారు. రైతులు తమ పంట పొలాలకు వెళ్ళినప్పుడు అనుకొని సంఘటనలు జరిగి మృతి చెందుతున్నారు. ఇలా రైతు ఏవిధంగా మరణించిన ఆ కుటుంబానికి కేసీఆర్ ప్రభుత్వం పరిహారం అందించింది.

### 11వ విడతల్లో రైతుబంధు సాయం...

ఉమ్మడి మెదక్ జిల్లాలో 85,99,091 మంది రైతుల ఖాతాల్లో రూ. 8,771.73 కోట్లను కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు డబ్బులు జమచేసింది. మే 2018లో కేసీఆర్ రైతుబంధు పథకాన్ని ప్రారంభించారు. పథకం ప్రారంభంలో ఎకరాకు రూ.4 వేల చొప్పున రెండు పంటలకు ఏడాదికి రూ.8 వేలను అందించారు. తర్వాత ఎకరాకు రూ. 5 వేల చొప్పున రెండు పంటలకు ఏడాదికి రూ.10 వేలను అందించారు. ఇప్పటి వరకు 11 విడతలుగా నిరంతరాయంగా రైతుబంధును కేసీఆర్ అందించారు. ఒకప్పుడు తాగునీళ్లు, సాగునీళ్లు లేక కరువు కాటకాలకు నిలయంగా ఉమ్మడి మెదక్ జిల్లా..ఇవాళ గోదావరి నీళ్లతో సస్యశ్యామలమైంది. కేసీఆర్ చేపట్టిన సంస్కరణల మూలంగా పుట్ల కొద్ది ధాన్యం పండింది. కాలంతో నిమిత్తం లేకుండా ప్రతి గుంటనూ సాగు చేశారు. రైతు ముంగిటలోనే రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేసింది.



#### సంగారెడ్డి జిల్లా విద్యుత్ ప్రగతి

| | 2014కు ముందు | 2014 తర్వాత | ఖర్చు రూ. కోట్లల్లో |
|---|---|---|---|
| 220 కేవీ సబ్ స్టేషన్ | 01 | 02 | |
| 132 కేవీ సబ్ స్టేషన్ | 10 | 13 | మొత్తం రూ. 73.38 |
| ఈహెచ్‌టీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్ | 27 | 39 | |

#### టీఎస్ఎస్ పిడిసిఎల్

| | 2014కు ముందు | 2014 తర్వాత | ఖర్చు రూ. కోట్లల్లో |
|---|---|---|---|
| 33/11కేవీ సబ్‌స్టేషన్ | 104 | 149 | రూ.62.33 |
| 33కెవి లైన్స్ | 637.61 | 1020.17 | రూ. 24.57 |
| 11 కెవి లైన్స్ | 5463.63 | 8904.66 | రూ. 146.39 |
| ఎల్‌టీ లైన్స్ | 14,916.52 | 18465.37 | రూ.121.58 |
| పవర్ ట్రాన్స్‌ఫార్మర్ | 152 | 284 | రూ. 75.79 |
| డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ | 18196 | 35,658 | రూ. 280.07 |
| ఇతర పనులు | | | రూ. 281.66 |
| మొత్తం | | | రూ.992.39 |

#### సంగారెడ్డి జిల్లాలోని కనెక్షన్లు

| | 2014కు ముందు | 2014 తర్వాత |
|---|---|---|
| డోమెస్టిక్ | 3,16,727 | 5,54,356 |
| కమర్షియల్ | 33,718 | 68,461 |
| వ్యవసాయ | 68,048 | 1,00,788 |
| పరిశ్రమలు | 4,351 | 5,382 |
| హెచ్‌టీ | 1236 | 1915 |
| ఇతర సర్వీసులు | 6501 | 14,328 |
| మొత్తం | 4,30,581 | 7,45,230 |



*1,00,788 మంది వ్యవసాయ వినియోగదారులకు రూ. 1438.6 కోట్లు, నూతన వ్యవసాయ కనెక్షన్‌లకు గాను రూ.163.7 కోట్ల సబ్సిడీని ఇచ్చింది.*

### కాంగ్రెస్‌వి తప్పుడు లెక్కలు



కేసీఆర్ సర్కార్ చేసిన అప్పులను తప్పులతడకగా చూపించారు. రూ.4లక్షల కోట్లు లేని అప్పును రూ. 7 లక్షల కోట్లుగా తప్పుగా చెప్పారు. కాంగ్రెస్ అంటేనే మాట తప్పే పార్టీ. అప్పులు, అభివృద్ధి గురించి కేటీఆర్ మంచిగా వివరించి చెప్పిండు. ప్రజలకు ఇప్పుడు అర్థమయ్యింది.. ఏది తప్పో, ఏది కరెక్టో..

*– అంజయ్యగౌడ్, వెంకటాపూర్, కోహీర్ మండలం*

### అన్ని రంగాల్లో అభివృద్ధి



ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించిన కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమం కోసం ఎన్నో పథకాలు తెచ్చారు. గిరిజన తండాలను పంచాయతీలుగా మార్చి అభివృద్ధికి బాటలు వేశారు. గిరిజన గురుకులాలు ఏర్పాటు చేసి ఇంగ్లిష్ మీడియం బోధన అందించారు. పేద గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ చేసి హక్కులు కల్పించారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కేసీఆర్ సర్కార్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు లెక్కలతో మోసం చేస్తున్నది.

*– పవార్ శంకర్ నాయక్, సంజ్జారావుపేట తండా సర్పంచ్*

### ఆసరా కింద ప్రతినెలా రూ.102. 22 కోట్ల పింఛన్లు...

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆసరా పింఛన్ల కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రతినెలా రూ.102.22 కోట్లు లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమచేసింది. ఇందులో దివ్యాంగులు 37,785 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికోసం ప్రతినెలా ఒక్కొక్కరికి రూ. 4,016 చొప్పున రూ.15,17,44,560, మిగతా వర్గాల వారు 4,31,790 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 87,04,88,640 చెల్లించింది.

**సిదిపేట జిల్లాలో...**

సిద్దిపేట జిల్లాలో ప్రతినెలా 1,91,185 మంది లబ్ధిదారులకు రూ.41.39 కోట్లు, వీటిలో 14,237 మంది దివ్యాంగులకు ప్రతినెలా రూ. 5,71,75,792, మిగతా వర్గాలు 1,76,948 మంది లబ్ధిదారులకు రూ. 35,67,27,168 చెల్లించారు.

**మెదక్ జిల్లాలో...**

మెదక్ జిల్లాలో ప్రతినెలా 1,16,728 లబ్ధిదారులకు రూ. 25.24 కోట్లు, దివ్యాంగులు 8,558 మంది లబ్ధిదారులకు రూ. 3,43,68,928, మిగతా వర్గాలవారు 1,08,170 మంది లబ్ధిదారులకు రూ. 21,80,70,720 బ్యాంకు ఖాతాలో కేసీఆర్ ప్రభుత్వం వేసింది.

**సంగారెడ్డి జిల్లాలో...**

సంగారెడ్డి జిల్లాలో ప్రతినెలా 1.61,662 మంది లబ్ధిదారులకు రూ.35.58 కోట్లు, దివ్యాంగులు 14,990 మంది లబ్ధిదారులకు రూ. 6,01,99,840, మిగతా వర్గాల వారు 1,46,672 మందికి రూ. 29,56,90,752 లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో కేసీఆర్ ప్రభుత్వం వేసింది.



### రైతుబీమాతో ధీమా..

సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలో సన్న, చిన్న కారు రైతులే అధికంగా ఉన్నారు. రైతుబీమా ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో 16,061 మంది రైతు కుటుంబాలకు రూ. 803.05 కోట్లు కేసీఆర్ ప్రభుత్వం అందించింది.ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున నేరుగా రైతు నామినీ ఖాతాలోనే జమ చేసింది. రైతులు అనుకొని సంఘటనల్లో మృతిచెందితే ఆ కుటుంబాలకు కేసీఆర్ ప్రభుత్వం రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందించింది.

## కేసీఆర్ సర్కారులో ప్రతి ఒక్కరికీ విద్య



కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి అప్పు తెచ్చినా.. భారీ స్థాయిలో సంపదను సృష్టించింది. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యను అందించింది. ప్రతి మండల కేంద్రానికి గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య లభిస్తున్నది. నిరుపేద విద్యావంతులే విదేశాల్లో చదువుకోవడానికి వడ్డీ లేని రుణాలు మంజూరు చేసింది. రాష్ట్రం దివాళా తీయకుండా పదేండ్లు నెట్టుకొచ్చింది. చివర వరకు మిగులు బడ్జెట్‌ను చూపించింది. తెలంగాణను అప్పుల కుప్పగా చేశారనడం కాంగ్రెస్ నాయకుల అవివేకానికి నిదర్శనం.

*– పోలీస్ దేవేందర్, అక్కన్నపేట గ్రామం, రామాయంపేట మండలం*

## అభివృద్ధిపై కాంగ్రెస్ గొడ్డలి వేటు



కరెంట్, తాగు,సాగునీటితో 60 ఏండ్లు గోసపడిన తెలంగాణను కేవలం ఆరున్నరేండ్లలోనే అబ్బురపడే అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కింది. సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి వసతులు, ఇంటింటికీ సంక్షేమం పథకాలను అందించిన కేసీఆర్ ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయడం విడ్డూరం. కారుచీకట్ల తెలంగాణకు 24 గంటలు కరెంట్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. బీఆర్ఎస్ హయాంలో అప్పులు పెరిగాయి.. ఇప్పుడు మేం ఆరు గ్యారెంటీలను ఎట్ల అమలు చేయాలి..? అనడం సరికాదు. రాష్ట్రం అప్పులపాలైందనే సాకు జెప్పి కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారు.

*– అహ్మద్ (అహ్మదీపూర్ గ్రామం, గజ్వేల్ మండలం)*

### పదేండ్ల అభివృద్ధి కండ్ల ముందుంది



పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి కండ్ల ముందు కనబడుతున్నది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ శ్వేదపత్రంలో చెప్పిన విధంగా అప్పటి, ఇప్పటి తెలంగాణకు చాలా తేడా ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు అరిగోస పడ్డాం. ఆంధ్ర నుంచి విడిపోయినంక ఒక్కొక్కటి చేసుకుంటూ వచ్చిను అప్పటి సీఎం కేసీఆర్. కరెంట్ గోస అయితే చెప్పరానిది. ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటేనే దొరికేది కాదు. ఇప్పుడు బీఆర్ఎస్‌పై అబండాలు వేయడం సరికాదు. అందరికీ మేలు జరిగేలా చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. ఇది అందరికీ తెలిసిన విషయమే.

*– పి.వెంకట్‌రెడ్డి (సిద్దిపేట, మందపల్లి)*